పిల్లలు గల తల్లి

కాంతం మంచంలో పడుకొని వుంది, అప్పటికి పది రోజుల నుంచీ రక్త విరోచనాలు: లేవటానికి శక్తి లేదు. బార్లినీళ్ళే ఆహారము. అటునుంచి యిటు పొర్లటానికికూడా ఓపిక లేక ఆయాస పడుతున్నది. ఇంట్లోతగినంత ఆడదక్షత లేకపోవడం మూలనబయుటపని ఇంట్లోపనికూడా నేనేచూచుకోవలసి వచ్చింది. నానాయాతన పడుతున్నాను.

ఆ రోజున సోమవారం-సంక్రాంతి సెలవులు అయిపోయి స్కూలు తెరిచారు. భార్యకు జబ్బుగా వుంది. ఈ రోజున సెలవు ఇయ్యాలిసిందని అడిగాను. స్కూలు తెరిచిన రోజున సెలవు యివ్వటానికి రూల్సు ఒప్పుకోవు. వచ్చి తీరాలె ఒక్క పూటైనా, లేకపోతే సెలవల జీతం అంతా పోతుందన్నారు. ఏం జేస్తాము. రూల్సు!! రూల్సుకు హృదయం ఉందా? అవి కొండపీటి నల్లరాళ్ళు. వాట్లో రక్తమాంసాలు లేవు, అందుకని దయాదాక్షిణ్యాలు లేవు. లేవు మరి ఏం జేస్తానూ! రూల్సు! రూల్సు! రూల్సు ప్రకారం నేను అ రోజు స్కూలుకు పోవాలె, తప్పదు.

కొంతసేపటికి తెల్లవారింది. తెల్లవారటంతోనే మా ఆవిడకు మొఖం కడిగించాను, బెడ్ పాన్ అదీ కడిగి, పక్కదులిపి-క్రొత్త దుప్పటి వేశాను. కాసిని బార్లీనీళ్ళు కొద్దిగా పండ్లరసం యిస్తే ఆవిడ సుఖంగా పడుకొన్నది. కొద్దిగా నిద్ర పట్టింది. ఎవరో ఒకమ్మను, ఆవిడను కనిపెట్టి వుండమని చెప్పి, నేను బజారు కెళ్ళి ఇంట్లోకి కావలసిన వస్తువులూ; మందూ తెచ్చాను. తరువాత నేను స్కూలుకు వెళ్ళాలిగా! వెళ్ళాను.

నేను వచ్చేసరికి ఒంటిగంట అయింది. వచ్చీరావటం తోనే ఆవిడ దగ్గఅకు వెళ్ళి మందుయిచ్చి ప్రక్కలో కూర్చున్నాను. చాలా నీరసంగా ఉంది, కళ్ళెత్తి దీనంగా-కడు దీనంగా నావైపు చూచి మళ్ళీ కళ్ళు మూసుకొంది.

ఒక్క క్షణంలో ఏదో జ్ఞాపకం వచ్చినట్లు చటుక్కున కళ్ళు తెరిపిడి చేసికొని, మీరు "భోజనం చేశారా" అని నా గడ్డం తన మునివేళ్ళతో పట్టుకొని అడిగింది, "లేదు, వెడతాలే, మరేమి తొందఱలేదు" అన్నాను నేను. "ఇంకా భోజనం చెయ్యలేదండీ? రెండు కావచ్చింది. ప్రొద్దున ఏమైనా తిన్నారా? అయ్యయ్యో, ముందు వెళ్ళి భోజనం చేసిరండీ" అని అంటూ మృదువుగా శుష్కించిన ఆ వేళ్ళతో నా చెంపలు తాకింది, "తొందర లేదులే కాంతం" అన్నాను నేను.

"ఇంకా తొందర లేకపోవటం ఏమిటండీ? నాకేమీ అక్కరలేదు. మీరు వెంటనే వెళ్ళి అన్నం తిని రండి. పాపం, ఈ పదిరోజుల నుంచీ మీకు తిండీ అమరటం లేదు. చిక్కి సగమయి పోయినారు, నాకోసం మీరేం దిగులుపడకండి. నాకేం ఫరవాలేదు. ఆ కృష్ణభగవానుడు నన్ను రక్షిస్తాడు. ఆ ప్రభువునే నమ్ముకున్నాను." అని చెంపల మీద వేళ్ళతో "డ్రం"చేసి దీనంగా చూసింది.

అయ్యో పరమ దుర్మార్గుణ్ణి. అప్పుడు ఆమెను ఒక ముద్దుకూడా పెట్టుకోలేదు. ఈ పాడుజన్మకు అదృష్టంలేదు.

నమ్మాను ఆవిడ మాటలు. భగవంతుడు భక్త రక్షకుడు అనుకొన్నాను.

కృష్ణ భగవానుడు ఆమెను నిజంగా రక్షిస్తాడను కొన్నాను.

ప్రభువు అన్యాయం చేశాడు.

భోజనం చేసివచ్చిన తరువాత మళ్ళీ ఆవిడ దగ్గర కూర్చుని కాళ్ళు పిసుకుతున్నాను. "నేనెంత పాపాత్మురాలనో నండి. మీ చేత కాళ్ళు పిసికించుకుంటున్నాను" అన్నది, నాకు ఏమనాలిసింది తోచలేదు, భర్త అయిన వాడికి అది విధి అని చెపితే ఆవిడకు నచ్చుతుందా? నచ్చచెప్పడానికీ ఎక్కువగా మాట్లాడటానికీ అది సమయమా ?" "మరేం ఫరవాలేదు కాంతం" అని మరింత శ్రద్ధగా కాళ్ళు వత్తాను. పది నిమిషాలు కాబోలు మగతగా పడుకొంది.

ఇంతలో చటుక్కున కళ్ళు తెరచి— "మళ్ళీ మరచి పోతాను చెప్పటం, మా మరదలుకు మనం త్రాగే కాఫీ సయించటం లేదు, అది ఈ కాఫీ త్రాగటం లేదట. గుండు కాఫీగింజలు ఒక నవాశేరు తెప్పించండి" అని చెప్పింది, అంత జబ్బులో కూడా గృహ నిర్వహణభారం వదలలేదు.

ఈ మాటలు మాట్లాడడం వల ఆయాసం కలిగిందో ఏమో, మళ్ళీ సొమ్మసిల్లి కళ్ళు మూసింది.

ఇంతలో రాధాయి, విజయ పలకపుల్ల కోసం పోట్లాడు కొన్నారు. "అమ్మా చూడవే, నా పలకపుల్ల అబ్బాయి తీసుకొన్నాడు" అని అమ్మతో కంప్లైంటు చేసింది. పసివాడు వచ్చి ఆ పలకపుల్ల దానిదికాదే నాదేను, అది తీసుకొని నా

కివ్వానంటే నేను లాక్కున్నా నన్నాడు. ఈ ఇద్దరిమాటలు విన్నది. అంత జబ్బులో వున్న మనిషికి ఈ కుక్క జట్టీలన్నీ విని సద్దడానికి నిజానికి ఎంత విసుగు!

నాకే కోపం వచ్చింది, "పో వెధవ. పో అవతలకి. అమ్మకు జబ్బుగా ఉంటే వెధవ కంప్లైంట్సు అన్నీ తీసుకొస్తావు" అని విసుక్కున్నాను,

నాకు కోపం వచ్చింది. ఆమెకు రాలేదు. నేను విసుక్కున్నాను గాని ఆమె విసుక్కోలేదు. నా మాటలు విని ఆమె "అల్లా అనకండి. వాళ్ళకేం లుసు? రా నాన్నా, మా తండ్రీ రారా, మా అమ్మా చిట్టితల్లీ, రా అమ్మా" అని వాళ్ళిద్దరినీ ప్రక్కలో కూర్చోబెట్టుకుని ముద్దాడింది. ఆతల్లి ముద్దులో ఏం మహాత్యం ఉందో కాని, వాళ్ళిద్దరు తమ పోట్లాటనూ, ఆ క్షణంలో మరచిపోయినారు. ఆ తగూ ఇట్టె తీరిపోయింది. చిన్నది తల్లి మెడను కౌగలించుకొంది. రాధాయ తల్లి కాళ్ళమీద పడ్డాడు.

ఆ మాతృ హృదయం, ఈ పుత్ర-పుత్రికా-గాత్రపరిష్వంగంలో ఎంత సంతోషించిందో, ఆమె ఎంతటి బ్రహ్మానందం పొందిందో!

కానీ,

నేను వచ్చి పాపిష్టి ముండావాణ్ణి, నేనే వచ్చి, లేవండి నాన్నా, అమ్మమీద పడబోకండి, అమ్మకు జబ్బుగాఉంది," అని వాళ్ళిద్దరిని చెరో రెక్కతో పట్టుకొని, మంచం దింపి, హాల్లో దిగవిడిచి వచ్చాను. తల్లి పాపం, దీనంగా చూచిందే

కానీ మాట్లాడ లేదు. ఆ మాతృహృదయం పొందిన పరి తాపమంతా ఆ నీరసించిన కళ్ళలో చూడటానికి నాకు కళ్ళు లేక పోయినాయి.

తల్లినీ పిల్లలనూ వేరు చేసింది నేనే. ఆరోజున దుర్మార్గం చేశాను. నేనే ఈ చేతులతో విడతీశాను. ఈ చేతులను ఏ మహాత్ముడైనా ముక్కలు-ముక్కల క్రింద నరికి, కాకులకూ గద్దలకూ వేసి పుణ్యం కట్టుకుంటే బాగుండును.

పిల్లలు తల్లి మీదపడి ఆవిడకు బాధ కలుగజేస్తారను కొన్నానుగాని, అదే ఆఖరుసారిగా వాళ్ళు మాతృమూర్తిని ధ్యానిస్తూ ఉన్నారని నేను ఊహించలేక పోయినాను.

మా ఆవిడకు జబ్బుగా ఉందని తెనాలి నుంచి డాక్టరు గారు వచ్చారు. ఆయనకు ఎక్కడ మర్యాద తక్కువ అవు తుందోనని ఆదుర్దాపడి ఆవిడ మూడు గంటలకు నన్ను దగ్గరకు పిలిచి చెవిలో అన్నదీ, "డాక్టరుగారికి ఫలహారం తెప్పించారా" అని. "లేదు" అన్నాను నేను. "చూశారా, పెద్దమనిషి మన ఇంటికి ఎందుకొస్తాడు చెప్పండి. ఆయన మా తమ్ముడ్నిపట్టి, నన్ను, చూడటానికి వచ్చాడు. కోట య్యను పంపి ఫలహారం, కాఫీ తెప్పించి ఇయ్యండి" అని అనలేక అన్నది. ఇక గంటలలో ఉంది ఆమె ప్రయాణం. అయినా ఆమె కుటుంబవిషయమై జాగ్రత్తపడుతూనే ఉంది.

ఆరోజు సాయంత్రంకూడా మళ్ళీ నన్ను పిలిచింది సంజ్ఞా పూర్వకంగా. మాట చాలా నీరసంగా ఉండటం మూలాన వంగి, ఆ మాటలు వినటానికి ప్రయత్నించాను. చూడండీ,

సాయంత్రానికి పిల్లలు ఏమైనా పెట్టమంటూ వస్తారు. మధ్యాహ్నం తెచ్చినవి ఏమైనా మిగిలివుంటే సరేసరి. లేక పోతే కాస్తన్నా చెయ్యమనండి అత్తగారిని. పసివెధవలు ఆడుకొనివచ్చి ఏమయినా పెట్టవే అమ్మా అంటూ వస్తారు. వాళ్ళసంగతి కాస్త చూడమనండి ఆవిడను" అన్ని మాటలు నీరసంగా ఒక్కొక్క మాటే అనలేక, అనలేక అని మళ్ళీ కళ్ళు మూసింది.

గంట-గంటకూ నేను మందు ఇస్తూనే ఉన్నాను. ఎత్తి పోస్తూనే వున్నాను. విరోచనాలు తగ్గలేదు. రాత్రి ఎనిమిది దాకా ఆవిడ మాట్లాడలేదు. ఎనిమిదింటికి అత్తగారు ఆవిడ ఎదుటకు రావటంచూచి "పిల్లలు అన్నం తిన్నారా? శాస్త్రి కడుపునిండా తిన్నాడా, పిచ్చివెధవ వట్టి అమాయకుడు, అని అన్నది. తిన్నారమ్మా అంతా తిన్నారు. నేను తిని నీ దగ్గరకు వస్తాను" అని మా పిన్ని అంటే ఆవిడ గుడ్లనీళ్ళు తిప్పుకొని మీరే చూడాలె వాళ్ళని" అన్నదట. పక్క నున్న మహాలక్ష్మమ్మగారు వృద్ధురాలు "నీకేమీ ఫరవాలే దమ్మా పిచ్చితల్లీ! నీకేం ఫరవాలేదు" అని ధైర్యంచెప్పితే, విని కళ్ళువిప్పి ఎదురుగా. కావలెనని పెట్టి ఉంచుకొనిన కృష్ణుడిపటానికి రెండు చేతులెత్తి నమస్కరించి మళ్ళీ మగతగా పడుకొంది.

జబ్బు బలంగా ఉందనీ ఆదుర్దా పడుతున్నాము కాని, ఇంతపని అయ్యే స్థితిలో ఉందని మేము కలలోనైనా అనుకో

లేదు. ఆ స్థితిలోకి దిగుతుందేమో అని భయపడ్డాముగాని, ఇదివరకే దిగింది, ఇక కొన్ని గంటలకాలమే వ్యవధి ఉందీ అని మేమెవ్వరమూ ఊహించలేక పోయినాము. ఆ మహా లక్ష్మమ్మగారు గ్రహించిందట, ఆమె మాకు చెప్పలేదు.

రాత్రి ఎనిమిది గంటలదాకా అంటే ఆవిడ ఈ లోకపు గొడవలో ఉన్నంతవరకూ, స్పృహ తెలిసినంత వరకూ, భర్త, పిల్లలూ, బంధుగులూ, స్నేహితుల విషయమై కను క్కోవలసిన విషయాలన్నీ కనుక్కుంటూనే ఉంది.

ఎనిమిది గంటలకు నాతో కడసారి అన్న మాటలు ఏమిటి? చూడండీ, ఆ రాధిగాడు, చిట్టీ పోట్లాడు కొంటున్నారు. మీరు వెళ్ళి ఆ ఇద్దరినీ, పక్కలో పడుకో పెట్టుకొని నిద్ర పుచ్చండి...ఆ పాపకు కథ చెప్పండి. కథ చెపితేగాని నిద్ర పోదది. రోజూ చెప్పే ఆ మేక కథే చెప్పండి - నిద్రపోతుంది అది అన్నది.

నేనూ, "పోనీలేవే. కాసేపు పోట్లాడుకొని వాళ్ళే నిద్ర పోతారూ" అంటే. "అల్లాగ కాదు. మీరు నా దగ్గర ఉండ నక్కరలేదు. నాకు అవసరం ఉంటే పిలుస్తాను లెండి" అని నన్ను పిల్లలను నిద్రపుచ్చటానికి పంపింది.

మాతృప్రేమ ఎంత విలువైంది. ఈ లోకంలో ఉన్నంత వరకూ, తనకు తెలివి ఉన్నంతవరకూ, మంచంలో వుండి, అంత జబ్బులో ఉండికూడా ఇంటికి సంబంధించిన అన్ని విషయాలూ చూచుకొన్నది. పిల్లలకు ఏమి కావాలో చూచింది. భర్త కష్టపడుతున్నాడే అని ఆవేదన పొందింది.

వచ్చిన బంధువులకూ, మిత్రులకూ మర్యాదలో ఏమిలోపం జరుగుతుందో అని ఒక కంట కనిపెడుతునే ఉంది. పిల్లల తగూలు తీరుస్తూనే ఉంది మంచంలో ఉండీ. తెరవలేక-తెరవలేక కళ్లు తెరుస్తూ గృహకృత్యాలన్నీ నిర్వహిస్తూనే ఉంది.

ఎనిమిది గంటల తర్వాత - ?— ? ? ? ?

బాధ, బాధ, బాధ, బాధ, మూల్గు.... చెప్పలేదు-ఏమిటో బాధ.

సుమారు రెండు గంటలప్పుడు మట్టుకు "ఎక్కడున్నారు, అంది." "ఎక్కడో నా తల్లీ, ఇక్కడే— నీ మంచంకోడును తలను ఆనించుకొని, కూర్చొని ఉన్నా."

నావంక తిరిగి, కన్నెత్తి చూడలేదు—

విరోచనం అయినట్లు ఉందీ అన్నది, వెంటనే ఆయిల్ క్లాతు తుడిచివేసి పైన తెల్లటి వస్త్రము వేశాను.

అట్లాగే గుడ్లు పెట్టికొని చూస్తున్నాను.

ఆమె నిద్ర పోలేదు మూల్గుతున్నది.

వళ్లు పట్టుకొని మాటిమాటికి చూశాను.

ఎప్పుడూ వేడిగానే ఉండేది.

ఎదుటనే గడియారం గోడపైనున్నది. ఎదుట గదిలో టక్—టక్— అని నీరసంగా రెండు కొట్టింది. చూస్తూ కూర్చున్నా— నాకు ఆమె స్థితినిగూర్చి భయం కలుగలేదు. దుఃఖం కలగ లేదు. ఏమీ లేదు. మనస్సులో ఆలోచనలు ఏమీ లేవు...శూన్యం. గడియారపు టక-టక శబ్దం దూరా.

నుంచి చాలా మందంగా వినిపిస్తున్నది. నేనూ, మహా లక్ష్మమ్మగారూ అల్లాగ కూర్చున్నాము.

అల్లాగ చూస్తూ కూర్చున్నాను.

నేనొక శిలామూర్తిని అయిపోయినాను. నా చూపులు ఆ అవిలోకితేశ్వరుని చూపులు అయినై.

టక్—టక్—టక్— మూడు కొట్టింది.

మళ్ళీ ఒకసారి శరీరాన్ని తాకి చూశాను. చూశానే గాని ఎందుకో, తెలియదు. డాక్టరుగార్ని లేపాను. ఎందు కంటే అప్పుడు ఆమె బాధో-బాధో అని విపరీతమయిన బాధ పడ్డది.

ఆయన వచ్చి ఒక్క ఇన్‌జెక్షన్ ఇచ్చాడు

ఇచ్చీ-ఇయ్యటంతోనే కళ్ళుమూసింది. మూల్గుమానింది. నేను డాక్టరుగారివంక దీనంగా చూశాను, ఆయన భయం లేదు. నిద్రబోతుంది, లేపబోకండి అన్నాడు.

బాధ తగ్గి ఆవిడకు నిద్ర పట్టింది, ఆవిడ బాధ పడటం లేదు, నిద్రపోతున్నది అన్న భావం మనోవ్యథను కొంత తగ్గించి ఉంటుంది, కాకపోతే మరేదో విచిత్రమైన, అనూహ్య మయిన కారణమయినా ఉండాలె. ఎందుకంటే నాకూ అప్పుడే కొద్దిగా కునుకు పట్టింది. ఆమె మంచపు పట్టెపై తల మోపి కళ్ళు మూశాను.

ఎంతసేపు? నాకు తెలియదు.

ఉలిక్కిపడి కళ్ళు తెరిచాను. వెంటనే నా సుఖదేవత ముఖంవంక చూశాను. ఏదో భయం వేసింది. తల్లీ అని గడ్డం పట్టుకొన్నాను.

ఇంకేముంది మహాప్రభో—కొయ్య, కొయ్యగా ఉంది.

చూస్తుండగానే కఫం అడ్డపడ్డా, అతి కష్టంమీద ఏవో కొన్ని మాటలు అన్నది. నాకు తెలియలేదు, రుక్కూ, మంగా, శాస్త్రీ, రాధా, విజయా అని పేరు-పేరునా పిల్లలను పిలిచి అతి కష్టంమీద రెప్పలెత్తి వాళ్ళను చూచింది. వాళ్ళంతా నమస్కరించి, "అమ్మా" అన్నారు.

అమ్మ పలకలేదు,

నేను పక్కనే ఉన్నాను. తల్లీ — కాంత— అన్నాను. కళ్ళెత్త లేదు. ఈ పాపిష్టిముండా వాణ్ణి చూడకపోవటమే మంచిది.

అమ్మా, అమ్మా, అమ్మా, అమ్మా, అమ్మా, అని అయిదుగురు పిల్లలూ అల్లాడి పోయినారు. అమ్మా అని పిలవటానికి అదే, ఆఖరు.

గోడనున్న గడియారం అయిదు మీద ఆగిపోయింది. కాకులు కా, కా, అనుకొంటూ ఎక్కడికో, ఏ కొత్తదేశాలకో లేచిపోతున్నవి. సావిట్లో కట్టివేసిన లేగదూడ "అంబా" అంటూ తల్లడిల్లి పోతూ ఉన్నది.

నా పిల్లలకు తల్లి లేకుండా పోయింది. నా శాంతం ప్రపంచానికంతా అయిపోయింది.

: స మా ప్త ము :